తపోదీక్ష.. నియమాలే రక్ష

- 46 రోజుల పాటు పాటిస్తున్న క్రైస్తవులు
- తపోదీక్షలకు 20 ఏళ్లు
- గుడ్ ఫ్రైడేతో ముగింపు


సెయింట్ పీటర్ చర్చిలో దీక్షాధారులనుద్దేశించి మాట్లాడుతున్న రెవరెండ్ ఫాదర్ జాన్ ప్రకాష్


రక్షణ గిరి పుణ్యక్షేత్రంపై దైవ సందేశమిచ్చి శిలువ మార్గం చూపుతున్న ఫాదర్ ఆనంద్

కంచరపాలెం: మానసిక ప్రశాంతత, పాపపరిహారార్థం క్రైస్తవులు తపోదీక్షలను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు. 46 రోజుల పాటు సాగే ఈ దీక్ష విభూది ఈ నెల 22తో ప్రారంభమై.. ఏప్రిల్ 7న జరిగే గుడ్‌ఫ్రైడేతో ముగుస్తుంది. ఏసు సువార్త పరిచర్య ప్రారంభించడానికి ముందు 40 రోజులు జెరూసలేంలోని ఎడారి ప్రాంతంలో ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం దీనులను ఆయన ఆదుకున్నారు. ఏసు చేసిన ఉపవాస దీక్షలను తపస్కాల తపోదీక్షలుగా పిలుస్తారని జ్ఞానాపురం రక్షణ గిరి పుణ్యక్షేత్రం, సెయింట్ పీటర్స్ పునీత పేతురు రాయప్ప ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ సీహెచ్.రాజ్‌కుమార్ వివరించారు.

రక్షణ గిరిలో..

ఆదికాలంలో అనేక మంది రాజులు, ప్రవక్తలు, ప్రజలు పాపహారంగా శరీరమంతా బూడిద పూసుకొని గోనెబట్ట ధరించి ఉపవాసంతో 40 రోజులు తపస్సు చేసినట్లుగా పవిత్ర బైబిల్ ధ్రువీకరిస్తోంది. 2003లో రక్షణ గిరిలో తపోదీక్షలు ప్రారంభించి సంఘపరంగా నిర్దిష్ట నియమాలు ప్రవేశపెట్టారు. పూర్వం ఎవరికి వారే ఈ దీక్షలు పాటించేవారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సంఘటితంగా దీక్షలను స్వీకరిస్తున్నారు.

పెరుగుతున్న విశ్వాసులు..

భక్తిశ్రద్ధలతో 2003లో తపోదీక్షలు విశాఖ రక్షణగిరి జ్ఞానాపురం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణ కర్తల ఆధ్వర్యంలో పునీత పేతురు దేవాలయంలో అప్పట్లో 150 మందితో దీక్షలు ప్రాంభించారు. ఏటా ఈ దీక్షాధారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది పలు చర్చిల్లో సుమారు 5వేల మందికి పైగా దేవుని సేవలో ఉన్నారని ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు.

నిష్టతో దీక్షాధారులు..

తపోదీక్షలో జపమాలలను మహిళలు, పురుషులు ధరించారు. దీక్షధారణ సమయంలో నిత్యం దివ్యపూజల్లో పాల్గొంటున్నారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేసి తెల్లని వస్త్రాలు, నీలి వస్త్రాలు ధరించి మాంసాహారాన్ని, మద్యం విడిచి సన్మార్గంలో పయనించేందుకు నిష్టతో దీక్షలు పూనారు.

సేవ చేసే భాగ్యం



46 రోజుల ఉపవాస దీక్ష సమయంలో పేద, గొప్ప అనే తారతమ్యం లేకుండా అందరికీ సేవ చేసే భాగ్యం కలుగుతుంది. దీంతో సేవా భావాన్ని పెంపొందించుకొనే అవకాశం లభిస్తోంది.

– వెన్నెల విజయ్‌కుమార్, దీక్షాపరుడు, జ్ఞానాపురం

మానసిక ఒత్తిడి దూరం



దీక్షాకాలంలో మానసిక ఒత్తిడి నుంచి బయటపడుతున్నారు. దీక్షను స్వీకరించడం వల్ల పూర్తిగా ప్రార్థనకు కాలాన్ని గడపడంతో మానసిక శాంతి కలుగుతోంది.

– సందీప్‌కుమార్, దీక్షాపరుడు, కంచరపాలెం

సన్మార్గానికి దిక్సూచి



తపోదీక్షను స్వీకరించిన వారు అనేక జ్ఞాన వరాలను పొందుతారు. ఈ దీక్షల వల్ల శాంతిని పొందుతున్నారు. తపోదీక్షలు తరువాత సమాజంలో నైతిక బాధ్యతలను అలవర్చుకుంటున్నారు.

– రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, జ్ఞానాపురం

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


వాకర్స్ పార్కులో స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మురళీనగర్: వేసవిలో చిన్నారుల ఆరోగ్యం బాగుండాలంటే శరీరంలోని నీటి సమతుల్యను కాపాడుకోవాలని అపోలో ఆస్పత్రి నియోనేటాలజిస్ట్ డాక్టర్ సతీష్ వాడపల్లి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉతచి మెగా వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. సమ్మర్‌లో పిల్లల ఆరోగ్య సంరక్షణపై తల్లిదండ్రులకు పలు సూచనలిచ్చారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండాలంటే పానీయాలు, పండ్లు ఎక్కువగా ఇవ్వాలన్నారు. కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన గంజి లేదా బార్లీ, పప్పు తేటనీరు వంటి పానీయాల్లో ఏదో ఒకటి మూడు పూటలా పట్టాలని చెప్పారు. ప్రతి రోజు చిన్నారులకు 5–10 గ్లాసుల నీరు ఇవ్వాలన్నారు. ఉదయం 5–8, సాయంత్రం 4–7 గంటల మధ్య ఆటలకు పంపిచాలని తెలిపారు. గైనకాలజిస్ట్, లాప్రోస్కోపిక్ అండ్ రోబోటిక్ సర్జన్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కిరణ్మయి గొట్టాపు మాట్లాడుతూ వేసవిలో మహిళల్లో వెజైనల్ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తాయన్నారు. ముందు జాగ్రత్తల్లో భాగంగా వైజెనల్ పాడిగా ఉంచుకోవడం, లోదుస్తులు తరచుగా మార్చుకోవడం, టాంపూన్స్ వాడకాన్ని మానుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సురేంద్ర ఆరోగ్య జాగ్రత్తలపై వివరించారు.

150 మందికి వైద్య పరీక్షలు

ఈ శిబిరంలో 150 మందికి బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ సతీష్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సురేంద్రలను వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్‌లు ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ కోశాధికారి జె.కూర్మారావు, ఉపాధ్యక్షుడు ఎ.రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు బి.సూర్యనారాయణ, టి.వి.రమణ, ఎస్.సీతారామకృష్ణ, ఆర్.నాగేశ్వరరావు, సుబ్బారావు, అపోలో ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ జి.రాంబాబు శిబిరం నిర్వహణకు సహకరించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్

మద్రిపాలెం: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన కంచరపాలెం కప్పరాడ అశోక్‌నగర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివారలిలా.. కప్పరాడ అశోక్‌నగర్‌లో నివసిస్తున్న శాంతికి(30) ఇషాక్‌తో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు 5, రెండున్నర ఏళ్ల ఆడపిల్లలు ఉన్నారు. ఆదివారం ఇంటి మేడపైకి వెళ్లిన శాంతి మూడంతస్తుల భవనంపై నుంచి పక్కనే ఉన్న మరో ఇంటి మేడపై పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు సాయంత్రం వరకు ఫిర్యాదు చేయలేదని, వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందా లేక ప్రమాదవశాత్తు మృతి చెందిందా అన్న కోణంలో వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

హనుమంతవాక జంక్షన్‌లో తప్పిన ప్రమాదం


సిటీ బస్సును ఢీకొన్న కంటైనర్

ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద ఆదివారం సాయంత్రం పెద్ద ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న వాహనాలపైకి ఓ కంటైనర్ లారీ దూసుకొచ్చింది. ఈ ఘటనలో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో మధురవాడ నుంచి నగరానికి వెళ్తున్న వాహనాలు హనుమంతవాక కూడలి వద్ద సిగ్నల్ పడడంతో ఆగాయి. భీమిలి నుంచి నగరానికి వెళ్తున్న 999 నంబరు ఆర్టీసీ సిటీ బస్ కూడా కూడలి వద్ద ఆగింది. దాని పక్కన పలు ద్విచక్ర వాహనాలు ఆగి ఉన్నాయి. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన కంటైనర్ లారీ.. బస్సును ఢీకొడుతూ పక్క నుంచి దూసుకొచ్చింది. అంతేకాకుండా బస్సు పక్కన ఆగి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను కూడా ఢీకొంది. ఆయా బైకులపై వెళ్తున్న నలుగురు కిందపడి స్వల్ప గాయాలపాలయ్యారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి ఉంది. ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ఆర్టీసీ బస్సు మధ్య భాగం నుజ్జయింది. ఈ ఘటనలో ప్రాణాపాయం లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మితిమీరిన వేగంతో వచ్చిన కంటైనర్ లారీ ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టడం వల్లే దాని వేగం తగ్గిందని, లేదంటే ద్విచక్ర వాహన చోదకుల పైకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ డ్రైవర్, ద్విచక్ర వాహనచోదకుల ఫిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆరిలోవ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

మలుపుల వద్ద ఆటోల నిలిపివేత


సత్యం జంక్షన్ మలుపు వద్ద ఆటోలు

సీతమ్మధార: జాతీయ రహదారిపై సత్యం జంక్షన్ మలుపులో ఇష్టానుసారంగా ఆటోలు నిలిపివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం మలుపు వద్ద ఆటోలు ఉంచడంతో గురుద్వారా నుంచి సీతమ్మధార వైపు వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఆటోలు కనిపించకపోవడంతో మరికొంత మంది ద్విచక్ర వాహనదారులు జారి పడిపోయారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి కూడళ్లలో మలుపుల వద్ద ఆటోలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మద్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకె నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మాధవధార–2, 11 కేవీ రాజీవ్‌నగర్ ఫీడర్ల నిర్వహణ ప్రక్రియలో భాగంగా మాధవధారలోని కనకమహాలక్ష్మి టెంపుల్ రోడ్డు, శ్రీ శాంతి ల్యాండ్ మార్క్, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, ఆర్డీఏ ఆఫీస్ రోడ్డు, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రాజీవ్ నగర్ ప్రాంతంలోని మహాత్మా కాలనీ, వంశీనగర్, జీఐఎస్ ఏరియా, వుడా అపార్ట్‌మెంట్స్, గంగా, గోదావరి అపార్ట్‌మెంట్స్, అప్పయ్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

ఘనంగా ఆవరణ హోమం


అమ్మవారి శ్రీచక్రానికి పూజలు చేస్తున్న భక్తులు

సీతంపేట: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలితాపీఠంలో ఆదివారం శ్రీచక్ర నవావరణ సహిత ఆవరణ హోమం ఘనంగా జరిగింది. అమ్మవారి శ్రీచక్రం, మేరువు వద్ద ప్రత్యేక పూజలు , హోమం నిర్వహించారు. సోమవారం ఉదయం 8:30 గంటలకు సుబ్రహ్మణ్య హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే మంగళవారం ఉదయం 10 గంటలకు మన్యుపాశుపత హోమం జరుగుతుందని, పూజల్లో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

డాక్టర్ ఖాదర్ వలీకి సన్మానం నేడు

ఎంవీపీ కాలనీ: మిల్లెట్ ఆహారంపై విశేష కృషి చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీకి సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం సంఘం చైర్మన్ పీఎల్ఎన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలుత సాయంత్రం డాక్టర్ ఖాదర్ వలీ ప్రసంగం ఉంటుందని, అనంతరం పౌర సన్మానం చేస్తామని తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలి

కూర్మన్నపాలెం : దేశ స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమల వల్లనే దేశంలో ఆర్థికాభివృద్ధి విస్తరించిందని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కృషి చేయాలి తప్ప మూసివేయడం తగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు దీక్షలు ఆదివారం నాటికి 773వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా టీఎస్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కాలుష్య రహిత రాష్ట్రమే సీఎం లక్ష్యం

నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు


జెండా ఊపి విద్యుత్ క్యాంపెయిన్ రోడ్ షోను ప్రారంభిస్తున్న కె.కె.రాజు

బీచ్‌రోడ్డు: కాలుష్య రహిత రాష్ట్రమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఆధ్వర్యంలో విద్యుత్ క్యాంపెయిన్ రోడ్ షో నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ క్యాంపెయిన్‌ను కె.కె.రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి తరగని ఇంధన వనరులు, స్థిరమైన సాంకేతికతను అన్ని రంగాలలో పెద్ద ఎత్తున అమలు చేయడానికి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, నెడ్‌క్యాప్ ఎండీ ఎస్.రమణరెడ్డి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు హెచ్‌సీ షణ్ముకరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో ఎలాంటి అల్లర్లు చేయకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని హెచ్‌సీ సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌ల్లో రౌడీషీటర్లకు ఏఎస్ఐ కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనకమాంబ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా సంతోష్

ఉత్సవ తేదీలు ఖరారు


ఉత్సవ కమిటీ చైర్మన్ సంతోష్‌ను అభినందిస్తున్న గ్రామ పెద్దలు

సీతంపేట: స్థానిక సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండగను జూన్13న ఘనంగా జరపాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో పండగ తేదీలు ఖరారు చేశారు. జూన్ 11న పండగ చాటింపు, 12న తొలేళ్లు, 13న ప్రధాన పండగ, జూన్ 20న మారువారం జరపాలని గ్రామ పెద్దలు తీర్మానించారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా సారిపిల్లి సంతోష్‌ను గ్రామ పెద్దలు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బోర ఈశ్వరరావు, సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణ,ఇసరపు అప్పారావు, నమ్మి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సహృదయ సాహితి నూతన కార్యవర్గ ఎన్నిక


శేఖరమంత్రి ప్రభాకర్, అధ్యక్షుడు

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రధాన సలహాదారుడిగా డాక్టర్ ఎల్.ఆర్.స్వామి, ప్రస్తుత అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మరలా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె.జి.వేణు, టి.పి.ఎన్.ఆచార్యులు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.చినసూర్యనారాయణ, కోశాధికారిగా భాగవతుల సత్యనారాయణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా కొత్తూరి రమణ ఎన్నికయ్యారు. సీహెచ్.నిర్మలాదేవి, పి.వి.ఆర్.కుమార్‌రావు, కె.వి.ఎస్.మూర్తి, కె.ఎస్.వి.రమణమ్మ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు.

మార్కెట్‌లోకి మధుర ఫలం


నీలమ్మవేపచెట్టు వద్ద విక్రయిస్తున్నా మామిడి పండ్లు

అల్లిపురం: అందరికీ ఇష్టమైన మధుర ఫలాలు మామిడి పండ్లు మార్కెట్లోకి వచ్చేశాయి. వాస్తవానికి వైశాఖ మాసంలో అందుబాటులోకి వచ్చే మామిడి పండ్లు నెల రోజులు ముందుగానే దర్శనమిచ్చాయి. విజయనగరం జిల్లా అలమండ నుంచి రైతులు మామిడి పండ్లు తీసుకుని వచ్చి నగరంలో అమ్మకాలు జరుపుతున్నారు. డజను రూ.250కు విక్రయిస్తున్నారు.

కరకచెట్టు పోలమాంబ జాతరకు ఏర్పాట్లు

- అమ్మవారి ప్రచార రథం ప్రారంభం
- నేడు పందిరి రాట మహోత్సవం
- 4న వార్షిక పండగ


ప్రచార రథం ప్రారంభిస్తున్న ఈవో సురేష్‌బాబా, పాలక మండలి సభ్యులు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా, ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన ప్రచారం రథాన్ని ప్రారంభించారు. అమ్మవారిని పూజించే 14 గ్రామాల్లో వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు.

- మహోత్సవాలలో భాగంగా సోమవారం పందిరి రాట మహోత్సవం, పుట్టబంగారం, అమ్మవారి దేవర పండగలను నిర్వహించనున్నారు. వచ్చేనెల 3న తొలేళ్ల ఉత్సవం, 4న అనుపు మహోత్సవం జరపనున్నారు. 11న మారువారం పండగ నిర్వహించనున్నారు. 15న ఆలయంలో మహాన్నదానం ఏర్పాటు చేయనున్నారు. వచ్చేనెల 25వ తేదీ వరకు ఆలయంలో పండగ వాతావరణం కొనసాగనుంది.
- వార్షిక జాతరలో భాగంగా వచ్చేనెల 3వ తేదీ రాత్రి నుంచి తొలి పూజ, పంచామృత అభిషేకం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. రూ.1,516 చెల్లించి ఈ పూజలో భక్తులు పాల్గొనవచ్చన్నారు. పూజకు దంపతులను మాత్రమే అనుమతిస్తామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, ప్రత్యేక లఘు దర్శనం క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూనిస్టులకు సత్కారం


కార్టూనిస్టును సత్కరిస్తున్న ప్రతినిధులు

మల్కాపురం: కార్టూన్ కళా రంగంలో చేసిన సేవలకుగాను ప్రముఖ వ్యంగ్య చిత్రకారులు జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్న సందర్భంగా చిత్ర కళా సేవా సంస్థ చిత్రకళా పరిషత్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో పరిషత్ కార్యవర్గ సభ్యులు సుందర చలపతిరావు,జి.కె.వి.రాజు,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

30న సీతారాముల కల్యాణోత్సవం


సీతారాముల కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీరామ నవమిని పురస్కరించు కుని ఈనెల 30న సింహగిరిపై పురాతన రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్టు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహించ డం జరుగుతుందన్నారు. భక్తులంతా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే సింహగిరిపై రాజగోపురం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సీతారాముల సన్నిధిలో కూడా కల్యాణ మహోత్సవం ఉదయం 10.30గంటల నుంచి జరుగుతుందని పేర్కొన్నారు.

దేవాంగుల అభ్యున్నతికి సమష్టి కృషి

గాజువాక : దేవాంగుల సంక్షేమానికి అందర్నీ కలుపుకొని కృషి చేస్తానని విశాఖ జిల్లా దేవాంగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు బొమ్మన్న సత్య రాజ్ కుమార్ అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన దేవాంగ సంక్షేమ సంఘం ద్వితీయ మహాజన సభలో కార్యవర్గం ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. వస్త్రాల తయారీలో దేవాంగులది కీలక పాత్ర అని, వారి సమస్యల పరిష్కారం కలసికట్టుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ, సంఘం సీనియర్ నాయకుడు ఉప్పు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన


సమావేశంలో పాల్గొన్న షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు

సింధియా: కార్మికులు ఐక్యంగా సంఘాభివృద్ధికి పాటుపడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. షిప్‌యార్డ్ ప్రాంగణంలో బాబా సాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకై కృషి చేస్తు న్నామని తెలిపారు. ఆదివారం షిప్‌యార్డ్ కాలనీలోని బాలకృష్ణ కల్యాణ మండపంలో షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. డీజీఎం శేఖర్, మేనేజర్ సంతోష్, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు కె.శామ్యూల్ మాట్లాడుతూ ఉద్యోగుల భర్తీతోపాటు ప్రమోషన్, ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను బ్యాక్‌లాగ్ పోస్టులలో భర్తీకి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సంఘం వార్షిక ఆదాయం, వ్యయం , ప్రగతి నివేదికను ట్రెజరర్ వెంకట అప్పారావు ప్రవేశపెట్టగా సంఘ సభ్యులు ఆమోదించారు. అనంతరం అంబేడ్కర్, సావిత్రిబాయ్‌పూలే, బౌద్ధం పుస్తకాలను నేషనల్ అవార్డు గ్రహీత యూవీ రావ్ అతిథులకు బహూకరించారు.

వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తరశత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంప జేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు.